క్లుప్తంగా

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలందుకుంటున్న గంగమ్మ

చింతకొమ్మదిన్నె : కొత్తపేట– బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లో ఉన్న గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయాన్నే అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టువస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను, కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథరెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు శేషఫణి

వేంపల్లె : పట్టణ ఆవోపా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆవోపా క్యాంపు చైర్మన్ సాయి సత్యానారాయణ, అధ్యక్షుడు పుల్లగూరు గోవర్ధన్ తెలిపారు. అమ్మవారి శాలలో కడపకు చెందిన వైద్యులు, క్రిస్టిపాటి వెంకట శేషఫణి 132 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకట్రాం, ద్వారకా, లక్ష్మిశెట్టి, భరత్, మనోజ్, అరుణ్, సాయి, హరికృష్ణ పాల్గొన్నారు.

ఓబులంపల్లెలో..



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

చెన్నూరు : ఓబులంపల్లెలో నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైద్య నిపుణులు ముండ్ల లక్ష్మిశేఖర్, డాక్టర్ కార్తిక్ నేతృత్వంలో ముండ్ల శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి ఓబులంపల్లె పంచాయతీ నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. శిబిరంలో గుండెకు, మోకాళ్ల నొప్పులు, చర్మవ్యాధులు, పంటికి సంబంధించిన వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలతో పాటు స్థానిక యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



తడి పొడి చెత్తల వేరు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

జమ్మలమడుగు : ప్రజలదంరూ ప్లాస్టిక్ వ్యర్థాలను నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని శానిటేషన్ అధికారి నూర్‌బాషా పేర్కొన్నారు. కమిషనర్ వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో తడి, పొడి చెత్తలపై అవగాహన కల్పించడంతోపాటు ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. ప్రజలు, వ్యాపారులు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వాడరాదని సూచించారు.

గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు



నేడు వేములలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



నాడు వేములలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవనాలు
- రూ.1.84కోట్ల పాడా నిధులతో నిర్మాణాలు పూర్తి
- త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు

వేముల : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేశారు. వేములలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాలను నిర్మించారు. రూ.1.84కోట్ల పాడా నిధులతో నూతన భవనాలు పూర్తయ్యాయి. వీటిని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిచే ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో మండల వాసులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. గతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా సకాలంలో రోగులకు వైద్య సేవలు అందేవి కావు. దీంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణులకు కూడా కార్పొరేట్ వైద్య సేవలు అందించాలన్న ధ్యేయంతో పీహెచ్‌సీ రూపురేఖలు మార్చేశారు.

12 గదులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వేములలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 12గదులను నూతనంగా నిర్మించారు. ఆసుపత్రి సిబ్బందికి, రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించారు. రెండు ఓపీ గదులు, కాన్పుల గది, ఆపరేషన్ గది, ల్యాబ్ గది, మహిళా వార్డు గది, పురుషుల వార్డు గది, పరిపాలనా గతి, ఆయుష్షు గది, వ్యాక్సినేషన్‌కు గదులను నిర్మించారు. అన్ని రకాల వైద్య సేవలను రోగులకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కాన్పుల కోసం 24గంటలు ఆసుపత్రిలో సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు. అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచి రోగులకు వైద్య సేవలు అందించే ఏర్పాటు చేశారు.

కార్పొరేట్ వైద్య సేవలు

ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలే లక్ష్యంగా అధునాతన పరికరాలతో నూతన భవనాలు పూర్తయ్యాయి. ఇందులో 14 మంది సిబ్బంది పనిచేయనున్నారు. ఇందులో ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నిషియన్, ఫార్మసిస్ట్, నలుగురు సూపర్‌వైజర్లు, ఒక ఎంఎన్‌ఓ, ఇద్దరు అటెండర్ల నియమించనున్నారు. పీహెచ్‌సీ ద్వారా మండల వాసులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన వైద్య సేవలు అందనున్నాయి.

మాట ఇచ్చాడు.. అమలు చేశాడు

- వైఎస్సార్‌సీపీది అభివృద్ధి, సంక్షేమ ప్రభుత్వం
- గడప గడపకు మన ప్రభుత్వంలో సుధీర్‌రెడ్డి



జమ్మలమడుగు: లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : అర్హులకు నవరత్నాలను అందిస్తున్న ప్రభుత్వం తమదని జమ్మలమడుగు ఎమ్మెల్యే డా. మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లారు. స్థానికులు తాగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. త్వరలో సమస్యను పరిష్కరించాలని అధికారులకు సుధీర్‌రెడ్డి ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోని సచివాలయాల ఉద్యోగులు వలంటీర్ల ద్వార ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కారించే విధంగా చొరవ తీసుకోవాలని తెలియజేశారు. ప్రతి పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలతోపాటు సంక్షేమాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పథకాలన్నీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నాడు జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పథకాలందేవని, నేడు ప్రతి ఒక్కరికి పథకాలు అందిస్తున్నామని గుర్తు చేశారు. పంట నష్టపోయిన రైతులకు అదే సీజన్‌లోనే పంట నష్టపరిహారం ఇస్తున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీదే అని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి ఓర్వలేకే ఎల్లో పత్రికల ద్వారా పచ్చ పార్టీ తమ ప్రభుత్వంపై బురద జల్లుతోందని, ప్రజలు వారి మాటలను విశ్వసించే పరిస్థితుల్లో లేరని తెలిపారు. ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ మార్పుల్ శ్రీను, మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, గ్రామ నాయకులు గురప్ప, ప్రభాకర్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, రామిరెడ్డి, ఓబుళరెడ్డి, యోబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్.ఉప్పలపాడులో..

మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో రెండో రోజు గడప గడపకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ నాయకులు గురప్ప, ప్రభాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి గ్రామంలో ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ.. సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిరుపేద దివ్యాంగ విద్యార్థికి ఆర్థిక సాయం



దివ్యాంగునికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పీజీ రెండవ సంవత్సరం ఫీజు కట్టేందుకు ఇబ్బంది పడుతున్న నిరుపేద దివ్యాంగ విద్యార్థికి ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి యాదవ్ చేయూతనందించారు. ఆదివారం స్థానిక వైఎస్ మనోహర్‌రెడ్డి స్వగృహంలో తొండూరు మండలం గంగనపల్లె గ్రామానికి దివ్యాంగ విద్యార్థి హరికృష్ణకు 10 వేల సాయం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్ఫూర్తితో సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, కార్యదర్శి వెంకట సుబ్బయ్య, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో సీపీఐ నేతలు

ఎర్రగుంట్ల : సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం ఆపార్టీ మండల నాయకులు టీడ్కో, జగనన్న కాలనీలోని ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేత ఎంవీ సుబ్బారెడ్డి మట్లాడుతూ జగనన్న కాలనీలోని ఇళ్లకు రూ.1.80 లక్షలు ఏ మాత్రం సరిపోదన్నారు. ఇళ్ల నిర్మించుకోవాలంటే ప్రతి లబ్ధిదారుడికి రూ.5 లక్షలు ఖర్చువుతుందన్నారు. ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన సిమెంట్, కడ్డీలు ఉచితంగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు రాదాక్రిష్ణతో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఇస్లాం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన పీఠాధిపతి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి

జమ్మలమడుగు : పట్టణంలోని పలగాడి వీధిలో ఉన్న ఆస్థానయే గౌసియాలో పీఠాధిపతి, ప్రభుత్వ ఖాజీ సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ నూతన ఇస్లాం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం ఉదయం స్థానిక గౌసియా ఆస్థానంలో అల్ బుర్‌హాన్ హజ్ ఉమ్రా టూర్స్ మేనేజింగ్ డైరెక్టర్ సయ్యద్‌షా తాహీర్ పీరాఖాద్రీ, సయ్యద్‌షా నిజాముద్దీన్‌లు ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పీఠాధిపతి పాల్గొని మాట్లాడారు. ప్రతి ముస్లిం ఇస్లాం ప్రకారం నడుచుకోవాలన్నారు. ఇస్లాం అంటే శాంతికి చిహ్నం అన్నారు. ప్రతి ఒక్కరు నిజాయితీగా ఉంటూ తన శక్తి మేర దానధర్మాలను ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్థానయే గౌసియా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, జహంగీర్, చాపాడు మహమ్మద్ గౌస్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ ప్రసాద్

పులివెందుల రూరల్ : ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎంవీఐ ప్రసాద్ అన్నారు. ఆదివారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాంతాలలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులకు వాహనాలు నడిపేటప్పుడు ఏకాగ్రత అవసరమన్నారు. రోడ్డు భద్రతకు సంబంధించి పలు ప్రాంతాలలో పోస్టర్లను గోడలకు అతికించారు. వాహనాదారులు, ఆర్టీసీ డ్రైవర్లు తప్పని సరిగారోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. అధికారులు చెప్పే సలహాలు సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కు చెల్లింపు కోసం శ్రీశైలానికి..



శ్రీశైలం వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

లింగాల : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని మొక్కుకున్న పార్నపల్లె గ్రామానికి చెందిన ఎస్సీ సెల్ నాయకుడు శ్రీనివాసులు ఆదివారం మొక్కు తీర్చుకునేందుకు శ్రీశైలం వెళ్లారు. గత డిసెంబర్ 2న పార్నపల్లెలోని సీబీఆర్‌కు వచ్చిన సందర్భంగా సీఎంను శ్రీనివాసులు కలిశారు. మొక్కు చెల్లించడ కోసం సహాయం చేయాలని కోరారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆరు వాహనాలను ఏర్పాటు చేయడంతో శ్రీనివాసులతో పాటు ఎస్సీ కాలనీ ప్రజలు శ్రీశైలం వెళ్లారు.

శ్రమదానంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు భేష్



లయోలా కళాశాల ఆవరణంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

పులివెందుల టౌన్ : శ్రమదానం చేయడంలో లయోలా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు భేష్ అని కళాశాల ప్రిన్సిపల్ అమల్‌రాజ్ పేర్కొన్నారు. ఆదివారం ఆ కళాశాలలో వాణిజ్య విభాగం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో కలసి ఒక్కరోజు శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వారికి ఎవరూ సాటి లేరన్నారు. స్వచ్ఛభారత్ పద్ధతులను పాటించి శుభ్రం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు గంగాదేవి, వాణిజ్య విభాగం విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



వడ్డెర సంఘం నూతన కార్యవర్గం

వేంపల్లె : వడ్డెర సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం వేంపల్లెలోని ఎంఎంఆర్ కల్యాణ మండపంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లె సంటన్న, గౌరవ అధ్యక్షులుగా గంగరాజు, బత్తల ఆదినారాయణ, ఉపాధ్యక్షులుగా రాజా, రమణ ,తేజ, బత్తల గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా గోగుల ఎర్ర కొండయ్య, కార్యదర్శులుగా శ్రీను, గౌరవ సలహాదారులుగా వల్లెపు సుబ్బయ్య, బాలరాజు, మునిరాజా, సంయుక్త కార్యదర్శిగా రత్తయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే వడ్డెర సంఘం యూత్ అధ్యక్షుడిగా గోగుల మారుతీ కుమార్, ఉపాధ్యక్షులుగా శివ, గంగయ్య, లోకేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా వెంకటసుబ్బయ్య, కార్యదర్శులుగా సుబ్బరాయుడు, గోగుల హరీష్, రామచంద్ర, కార్యనిర్వహణ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఏకపక్షంగా ఎన్నిక జరగడం సరికాదు

స్థానిక ఎంఎంఆర్ కల్యాణ మండపంలో వడ్డెర సంఘీయులకు సంబంధించి అధ్యక్ష పదవిని ఏకపక్షంగా ఎన్నుకోవడం సరికాదని వడ్డెర కులస్థులు సుధాకర్, బ్రహ్మయ్య, సంటి, రమణ, గంగయ్య, కిట్టయ్య, భార్గవ్‌లు పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ వడ్డెర కులస్థులను పిలవకుండా కేవలం ఐదు కుటుంబాల వరకు పిలిచి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వడ్డెర కులస్థులలో కొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించుకొని త్వరలోనే అందరూ ఏకమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు. కార్యక్రమంలో యోగీశ్వరబాబు, సురేంద్ర, ప్రసాద్, రవి, సుబ్బయ్య, రాజ తదితరులు పాల్గొన్నారు.

క్యూబా సంఘీభావ సభలను జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రపంచ విప్లకారుడు చేగువేరా కుమార్తె అలైదా గువేరా వనువరాలు ప్రొఫెసర్ ఎస్తేఫనియా దేశ పర్యటనలో భాగంగా విజయవాడ వస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న క్యూబా సంఘీభావ సభను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు.

ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో స్వేచ్ఛ, సమానత్వం కోసం నాడు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా చేగువేరా అనేక వీరోచిత పోరాటాలను చేశారన్నారు. నేటి యువత చేగువేరాను రోల్ మోడల్‌గా చూస్తున్నారని అన్నారు. అలాంటి యోధుడి మనవరాలు భారత పర్యటనలో భాగంగా విజయవాడ వస్తున్న సందర్భంగా జరిగే సభకు మేధావులు, అభిమానులు, ప్రజా సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

డ్రైనేజీ పనులకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని వై కోడూరు గ్రామంలో డ్రైనేజీ, కాలువ నిర్మాణ పనులకు ఆదివారం జమ్మలమడుగు ఎమ్మెల్యే మూలె సుధీర్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతను ఇస్తామన్నారు. గ్రామంలో డ్రైనేజీ లేకపోవడంతో గ్రామస్తులు అభ్యర్థన మేరకు నిధులు కేటాయించి, పనులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జీ ఎం.సురేంద్రనాథ్‌రెడ్డిలు, సర్పంచ్ వాసుదేవరెడ్డి, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డితోపాటు జువారి సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హజ్ హౌస్ గురించి మాట్లాడే అర్హత టీడీపీకి లేదు



విలేకరులతో మాట్లాడుతున్న అన్వర్‌బాషా

చెన్నూరు : హజ్ హౌస్ గురించి మాట్లాడే నైతిక హక్కు తెలుగుదేశం పార్టీకి లేదని కమలాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగపు కన్వీనర్ అన్వర్‌బాషా తెలిపారు. ఆదివారం ఆయన చెన్నూరులో విలేకరులతో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మైనార్టీల కోసం హజ్‌హౌస్ నిర్మిస్తామని చెప్పినప్పుడు తామంతా స్వాగతించామన్నారు. ఖిల్లా మసీదుకు చెందిన 14 ఎకరాలు సేకరించారన్నారు. నిబంధనలు పాటిస్తూ నిర్మించాల్సిన హజ్ హౌస్‌ను తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుందన్నారు. దీంతో రూ.25 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. హజ్ హౌస్ నిర్మించేటప్పుడు ఎత్తులో నిర్మించాలనే, కనీస అవగాహన లేకపోవడంతో వర్షాలకు హజ్ హౌస్‌లోకి నీరు చేరుతోందన్నారు. కోవిడ్ సమయంలో కరోనా సెంటర్‌గా ఉన్న హజ్‌హౌస్‌లోకి వర్షపు నీరు చేరడంతో కరోనా బాధితులను తరలించేందుకు అధికారులు, పోలీసులు పడిన అవస్థలు అందరికీ తెలుసన్నారు. టీడీపీ హయాంలో కడప ఉర్దూ యూనివర్సిటీని కర్నూలుకి తరలించినప్పుడు వీరు ఎక్కడ పోయారని ప్రశ్నించారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ కరీం, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

వేంపల్లె : పట్టణంలోని తల్లి శెట్టి సుబ్రమణ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986–87 సంవత్సరంలో 10 వతరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. నిర్వహకులు కేశవ ప్రతాప్‌రెడ్డి, కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులందరూ ఒక చోట కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. గురువులు, పుల్లారెడ్డి, ఉషారాణి, వెంకటలక్ష్మమ్మ, వెంకట్రామిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి హాజరయ్యారు.

31 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం

సింహాద్రిపురం : మండల పరిధిలోని అంకాలమ్మ గూడూరులో 31 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఫిబ్రవరి 2, 3 తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆదివారం వారు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని మూడు రోజుల పాటు అభిషేకాలు, హోమాలు, సాంస్కృతిక కార్యాక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అలరించిన 'ఆట–పాట'



శాస్త్రీయ నృత్యప్రదర్శనలో చిన్నారి

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో ఆదివారం ఆట–పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో సాయంత్రం కోలా ప్రసాద్ సౌజన్యంతో యువరాజ డ్యాన్స్ మాస్టర్ శిష్య బృందంచే నిర్వహించిన జానపద, సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. జానపద, సినిమా పాటలకు చిన్నారులు చిందులు వేస్తుంటే సందర్శకుల చప్పట్లు, కేరింతలతో మెప్పించారు. శిల్పారామం సందర్శకులతో కిటకిటలాడింది.



జానపద నృత్యప్రదర్శనలో చిన్నారులు